TELANGANA SHASANA SABHA
TELTEL/2016/68867

తెలంగాణ
# శాసనసభ
తెలుగు దినపత్రిక

Published from Hyderabad,Rangareddy,Nalgonda,Mahabubnagar, Khammam,

తెలంగాణ | సంపుటి : 02 | సంచిక : 108 | ఎడిటర్ : పోలగోని రాజేష్ | మంగళవారం 24 సెప్టెంబర్ - 2024 | పేజీలు : 8 | వెల : 04/-

మోదీ మాకు సవాల్ విసిరారు..
## భారత ప్రధానితో భేటీపై
సుందర్ పిచాయ్ వ్యాఖ్య



న్యూయార్క్: అగ్రరాజ్యం అమెరికా పర్యటనలో ఉన్న భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిగ్గజ టెక్ కంపెనీల సీఈవోల తో రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సమావేశంలో భాగంగా మోదీ మాట్లాడుతూ.."గతేడాది వాషింగ్టన్ వచ్చినప్పుడు..

2


## మోడీ "మన్ కీ బాత్" వినేందుకు ప్రజలు సిద్ధంగా లేరు..



ఢిల్లీ / శాసనసభ : లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ శ్రీనగర్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాని మోడీని, బీజేపీని తీవ్రంగా టార్గెట్ చేశారు.

2

## పని ఒత్తిడిపై
నిర్మలా సీతారామన్ వ్యాఖ్యలు...
మండిపడిన కాంగ్రెస్



- విద్యార్థులకు విద్యతో పాటు పని ఒత్తిడి నిర్వహణపై కూడా బోధన జరగాలన్న నిర్మల
- కార్పొరేట్లకు ఇబ్బంది వచ్చినప్పుడే ఆర్థికమంత్రి పట్టించుకుంటారని కాంగ్రెస్ విమర్శ

2

నాకు ఆ సీఎం సీటు వద్దు..
## ఖాళీగానే ఉంచండి..!



2

శాసనసభ / న్యూఢిల్లీ : ఢిల్లీ నూతన ముఖ్యమంత్రి అతిషీ మర్లెనా ఈరోజు (సోమవారం) బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె ఆప్ అధినేత, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ పై తనకున్న గౌరవాన్ని చాటుకున్నారు.

# వన్ స్టేట్, వన్ డిజిటల్ కార్డులు
## త్వరలోనే పైలెట్ ప్రాజెక్ట్ ప్రారంభం



వివరాలు »»2లో

శాసనసభ / హైదరాబాద్ : రాష్ట్రంలో వన్ స్టేట్, వన్ డిజిటల్ కార్డు విధానంలో హెల్త్‌కార్డుల జారీకి ప్రణాళికలు రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. డిజిటల్ కార్డులో కుటుంబ సభ్యులందరి హెల్త్ ప్రొఫైల్ పొందుపరిచి, దాని ద్వారానే ఆరోగ్య సేవలు అందించాలన్నారు. ప్రతీ నియోజకవర్గంలో ఒక పట్టణం, ఒక గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు.

- డిజిటల్ కార్డులో కుటుంబ సభ్యులందరి హెల్త్ ప్రొఫైల్
- ప్రతీ నియోజకవర్గంలో గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు
- పథకాలన్నింటికీ వన్ కార్డు
- అర్హులందరికీ కుటుంబ డిజిటల్ కార్డులు

## ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి నివాసంపై కాంగ్రెస్ శ్రేణుల దాడి



### - తీవ్రంగా ఖండించిన బీఆర్ఎస్

శాసనసభ / హైదరాబాద్ : నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఇంటిపై దాడిని బీఆర్ఎస్ ఖండించింది. కాంగ్రెస్ నాయకత్వ ప్రోత్సాహంతోనే ఈ ఘటన జరిగిందని హరీశ్‌రావు ఆరోపించారు. వినాయక నిమజ్జనం నెపంతో ముందస్తు కుట్రతోనే కాంగ్రెస్ నేతలు దాడికి తెగబడ్డారని సునీతా లక్ష్మారెడ్డి మండిపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి నలుగురు కాంగ్రెస్ కార్యకర్తలపై పోలీసులు కేసు నమోదు చేశారు.

వివరాలు »»2లో

## గాంధీ ఆసుపత్రి వద్ద ఉద్రిక్తత -
# బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అరెస్టు



శాసనసభ / హైదరాబాద్ : సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రి వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకొంది.ఆసుపత్రి వద్దకు చేరుకున్న బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. పక్కా సమాచారంతో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని వైద్య, ఆరోగ్య సేవలపై బీఆర్ఎస్ నియమించిన త్రిసభ్య కమిటీ గాంధీ ఆసుపత్రికి రానున్న నేపథ్యంలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఆసుపత్రి వద్దకు చేరుకున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సంజయ్, మాగంటి గోపీనాథ్‌లను పోలీసులు అరెస్టు చేశారు.

వివరాలు »»2లో

## కాంగ్రెస్‌ది ప్రజాపాలన కాదు
# గుండా రాజ్యం నడుస్తుంది

- రాయలసీమ లాంటి ఫ్యాక్షన్ పరిస్థితులు తెలంగాణలో..
- కాంగ్రెస్ నాయకత్వం ప్రోత్సాహంతో జరిగిన దాడి
- పోలీసులపై దాడి జరిగినా కేసు నమోదు చేయడం లేదు..



శాసనసభ / హైదరాబాద్ : ఈ రాష్ట్రంలో ప్రజా పాలన కాదు.. గూండా రాజ్యం నడుస్తుందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల హక్కులను పూర్తిగా కాలరాస్తుందని మండిపడ్డారు. నర్సాపూర్ గోమారంలోని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి నివాసంలో మాజీ మంత్రి హరీష్ రావు మీడియాతో మాట్లాడారు.సీనియర్ శాసనసభ్యులు, మాజీ మంత్రి సునీత లక్ష్మారెడ్డి ఇంటి మీద కాంగ్రెస్ గూండాలు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

వివరాలు »»2లో

## డీజీపీతో సీఎం భేటీ..
లడ్డూ వివాదంపై సంచలన నిర్ణయం



అమరావతి / శాసనసభ : తిరుమల లడ్డూ వివాదంపై సీఎం చంద్రబాబు నాయుడు సంచలన నిర్ణయం తీసుకున్నారు. లడ్డూ కల్తీ ఘటనపై విచారణకు స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ను ఏర్పాటు చేయనున్నారు.ఈ మేరకు సచివాలయంలో పోలీసు, ఉన్నతాది కారులతో ఆయన భేటీ అయ్యారు. సిట్ ఏర్పాటుపై చర్చిస్తున్నారు. సిట్ చీఫ్‌గా సీనియర్ ఐజీ నియమాకంపైనా సమాలోచనలు చేస్తున్నారు. అధికారులు శ్రీకాంత్, త్రిపాఠి, వినీత్ పేర్లను పరిశీస్తున్నారు. నెయ్యి కొనుగోలు, టెండర్ ప్రక్రియపై సిట్ అధికారులు విచారణ చేపట్టనున్నారు. సిట్ నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకోనున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా పటిష్ట ఏర్పాట్లు చేయనున్నారు.

దుర్గం చెరువు పరిసర వాసులకు
# హైకోర్టు ఊరట..
కూల్చివేతలపై **స్టే..**



ఢిల్లీ / శాసనసభ : తెలంగాణ హైకోర్టు హైడ్రాకు కీలక ఆదేశాలు జారీ చేసింది. దుర్గం చెరువు పరిసరాల్లో హైడ్రా కూల్చివేతలపై హైకోర్టు స్టే విధించింది. 2014లో జారీ చేసిన ప్రిలిమినరీ నోటిఫికేషన్‌పై దుర్గం చెరువు చుట్టుపక్కల నిర్వాసితులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ..ఈ మేరకు వినతిపత్రం ఇచ్చారు. ఈ అభ్యంతరాలను లేక్ ప్రొటెక్షన్ కమిటీ పరిశీలించాలని హైకోర్టు పేర్కొంది. దుర్గం సరస్సు ప్రాంత నిర్వాసితులు అక్టోబర్ 4న లేక్ ప్రొటెక్షన్ కమిటీ ఎదుట హాజరుకావాలని పేర్కొన్న కోర్టు.. అభ్యంతరాలను పరిశీలించి అక్టోబర్ 4 నుంచి ఆరు వారాల్లోగా తుది నోటిఫికేషన్ విడుదల చేయాలని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు లేక్ ప్రొటెక్షన్ కమిటీకి ఆదేశాలు జారీ చేసింది. ఈ పరిణామంతో దుర్గం చెరువు పరిసర వాసులకు ఊరట లభించింది. మరోవైపు హైదరాబాద్ నగరంలో హైడ్రా కూల్చివేతలు కొనసాగుతున్నాయి. దీంతో వెంటనే రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు.. ముందుగా స్పోర్ట్స్ అకాడమీ నిర్మాణాలను తొలగించారు. నిర్మాణాలను తొలగించిన అధికారులు కావేరి హిల్స్ పార్క్ అనే బోర్డును ఏర్పాటు చేశారు.

## చైల్డ్ పోర్నోగ్రఫీ చూడటం నేరమే: సుప్రీం కోర్టు



ఢిల్లీ / శాసనసభ : ఛైల్డ్ పోర్నోగ్రఫీ చూడటం నేరం కాదని మద్రాసు హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఈరోజు (సోమవారం) కీలక తీర్పును ఇచ్చింది.ఛైల్డ్ పోర్నోగ్రఫీ చూడటం, ఆ వీడియోలను డౌన్‌లోడ్ చేసుకోవడం పోక్సో చట్టం కింద నేరమేనని చెప్పుకొచ్చింది. ఈ మేరకు మద్రాసు హైకోర్టు ఇచ్చిన తీర్పును అత్యున్నత న్యాయస్థానం తోసిపుచ్చింది.ఈ సందర్భంగా భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలాతో కూడిన ధర్మాసనం మద్రాస్ హైకోర్టు తీర్పును జారీ చేయడంలో ఘోర తప్పిదం చేసిందని పేర్కొంది. అలాగే, పోక్సో చట్టం సెక్షన్ 15 ప్రకారం.. చైల్డ్ పోర్నోగ్రఫీ మెటీరియల్‌ను (ఫొటోలు, వీడియోలు) వీక్షించడం మాత్రమే కాదు నిల్వ చేసుకోవడం కూడా నేరమే అని చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని ధర్మాసనం తీర్పు ఇచ్చింది. ఈ క్రమంలో గతంలో మద్రాస్ హైకోర్టు తీర్పును తీవ్ర తప్పిదంగా పేర్కొనింది. ఇక, ఈ కేసులో నిందితుడికి ఇచ్చిన ఊరటను ఎత్తేస్తూ.. క్రిమినల్ ప్రాసిక్యూషన్ కొనసాగించాలని తెలిపింది. పనిలో పనిగా.. కోర్టులు కూడా చైల్డ్ పోర్నోగ్రఫీ అనే పదాన్ని ఉపయోగించొద్దని సుప్రీం కోర్టు సూచనలు జారీ చేసింది.

శాసనసభ
తెలుగు దినపత్రిక
మంగళవారం 24 సెప్టెంబర్ - 2024

( మొదటి పేజీ తరువాయి )

## ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి నివాసంపై కాంగ్రెస్ శ్రేణుల దాడి



మెదక్ జిల్లా శివంపేట మండలం గోమారంలోని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి నివాసంపై దాడి ఘటనను భారత రాష్ట్ర సమితి తీవ్రంగా ఖండించింది. వినాయక విగ్రహ నిమజ్జనంలో భాగంగా సునీతా ఇంటి వద్ద కాంగ్రెస్ శ్రేణులు బాణా సంచా పేల్చడాన్ని బీఆర్ఎస్ శ్రేణులు అడ్డుకున్నాయి. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ సమయంలో ఇంట్లో సునీతా లక్ష్మారెడ్డితో పాటు కుటుంబసభ్యులు లేరు. వెంటనే పోలీసులు రంగలోకి దిగి, ఇరువర్గాల కార్యకర్తలకు నచ్చచెప్పి పంపించారు.కాంగ్రెస్ శ్రేణులు ఇంట్లోకి వచ్చి తమపై దాడి చేశారని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శివంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హైదరాబాద్ నుంచి గోమారం వచ్చిన ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి కార్యకర్తల దగ్గర వివరాలు తెలుసుకున్నారు. ఉద్దేశపూర్వకంగానే కాంగ్రెస్ శ్రేణులు దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. 'మా ఇంటి ముందు కావాలనే టపాసులు కాల్చారు. లోనికి వచ్చి ఇద్దరిపై దాడి చేశారు. మహిళా ఎమ్మెల్యే నివాసం వద్దకు వచ్చి ఇలా చేయడంపై ఉద్దేశం ఏంటి? వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలి. మా కార్యకర్తలపై దాడులు చేస్తే ఊరుకోం. ఇంట్లో నిద్రిస్తున్న వ్యక్తిపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేశారు. టపాసులు పేలుస్తూ గేటు నుంచి లోపలికి ముగ్గురు వ్యక్తులు వచ్చారు' అని సునీతా లక్ష్మారెడ్డి తెలిపారు.

## మోడీ "మన్ కీ బాత్" వినేందుకు ప్రజలు సిద్ధంగా లేరు..



జమ్మూకశ్మీర్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చడం ద్వారా ఇక్కడి ప్రజల ప్రజాస్వామ్య హక్కులను బీజేపీ హరించిందని అన్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు నరేంద్ర మోడీకి '56 అంగుళాల ఛాతీ' ఉందని చెప్పడాన్ని మీరు తప్పక చూసి ఉంటారని రాహుల్ గాంధీ అన్నారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయిందని.. గత ఎన్నికల ఫలితాల ఆధారంగా ఆయన వ్యాఖ్యానించారు. ఇండియా బ్లాక్, కాంగ్రెస్ పార్టీలు నరేంద్ర మోడీ సైకాలజీని మార్చేశాయన్నారు.ప్రధాని మోడీ సుదీర్ఘ ప్రసంగాలు చేస్తారని, ఆయన తన భావాల గురించి మాట్లాడుతారని, కానీ నిరుద్యోగం గురించి మాట్లాడరని రాహుల్ గాంధీ అన్నారు. ముందు దేశంలో నిరుద్యోగాన్ని తొలగించండి.. ద్రవ్యోల్బణాన్ని తగ్గించండి.. యువతకు దార్శనికత ఇవ్వండి.. జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఇవ్వండి.. ఈ విషయాలపై మోడీ స్పందించాలన్నారు. మోడీ 24 గంటలూ తన మనసులోని మాట(మన్ కీ బాత్) ను చెబుతూనే ఉంటారని.. కానీ ప్రస్తుతం ఎవరూ ఆయన మాట వినడానికి ఇష్టపడటం లేదన్నారు. చదువుకున్న వారికి ఉద్యోగాలు రాకపోవడంతో దేశవ్యాప్తంగా నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. ఇది నరేంద్ర మోడీ ఇచ్చిన బహుమతని విమర్శించారు.

## పని ఒత్తిడిపై నిర్మలా సీతారామన్ వ్యాఖ్యలు...మండిపడిన కాంగ్రెస్



విద్యార్థులకు విద్యను అందించడంతో పాటు పని ఒత్తిడి నిర్వహణ మీద బోధన జరగాల్సి ఉందని, సీఏ చదివిన యువతి పని ఒత్తిడిని భరించలేకపోయిందన్న వార్త తనను కలచివేసిందన్నారు. అయితే నిర్మలా సీతారామన్ ఏ కంపెనీ పేరు, యువతి పేరును ప్రస్తావించలేదు. కానీ ఇటీవల యర్నెస్ట్ యంగ్ ఇండియా ఉద్యోగి మరణాన్ని ఉద్దేశిస్తూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. విద్యార్థులకు విద్యతో పాటు పని ఒత్తిడిని జయించడాన్ని కూడా విద్యా సంస్థలు బోధించాలన్నారు.ఆమె వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. క్షీణిస్తున్న పని పరిస్థితుల గురించి మాట్లాడకుండా... పని ఒత్తిడిని జయించడం గురించి మాట్లాడటం సరికాదని కాంగ్రెస్ పేర్కొంది. కార్పొరేట్లకు ఇబ్బంది వచ్చినప్పుడే ఆర్థికమంత్రి పట్టించుకుంటారని, కార్పొరేట్ శ్రమ దోపిడీకి గురైన అన్నాసెబాస్టియన్ వంటి వారి బాధలు పట్టవని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ విమర్శించారు. బాధితురాలికి, ఆమె కుటుంబానికి అండగా నిలవాల్సింది పోయి... ఆమెదే తప్పున్నట్లుగా మాట్లాడటం సరికాదన్నారు. క్లిష్టమైన కోర్సుల్లో ఒకటైన చార్టర్డ్ అకౌంటెన్సీ చేసిన యువతికి పని ఒత్తిడి గురించి చెప్పాల్సిన అవసరం లేదని శివసేన (యూబీటీ) నేత ప్రియాంక చతుర్వేది మండిపడ్డారు. పని విధానం, సుదీర్ఘ పని గంటలు వంటి అంశాల గురించి ఆర్థికమంత్రి మాట్లాడాలని హితవు పలికారు. సున్నిత అంశాల పట్ల ఆచితూచి మాట్లాడాలన్నారు.

## నాకు ఆ సీఎం సీటు వద్దు.. ఖాళీగానే ఉంచండి..!



ఆయన కోసం పక్కన ఓ కుర్చీని ఉంచడంతో పాటు తాను వేరే సీట్లో కూర్చోని బాధ్యతలు చేపట్టారు. దీనికి సంబంధించిన విజువల్స్ ను ఆమ్ ఆద్మీ పార్టీ ఎక్స్ (ట్విటర్) ఖాతాలో పోస్ట్ చేసింది.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అతిషీ మర్లెనా మాట్లాడుతూ.. ఢిల్లీ సీఎం కుర్చీ ఎప్పటికీ ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ కోసమే ఉంటుందని తెలిపారు. రాముడు 14 ఏళ్లు వనవాసంలో ఉన్నప్పుడు భరతుడు రాజ్యం యొక్క బాధ్యతలు చేపట్టాల్సి వచ్చినప్పుడు ఎలాంటి బాధ కలిగిందో ఈరోజు నాకు కూడా అంతే బాధగా ఉంది అని పేర్కొన్నారు. ఎంతో కఠిన సమయంలో ఈ బాధ్యతలు స్వీకరిస్తున్నాను అని ఆమె చెప్పుకొచ్చారు. 14 ఏళ్ల పాటు భరతుడు కుర్చీపై చెప్పులు పెట్టుకుని పాలన ఎలా చేశాడో.. నేను కూడా అదే విధంగా రాబోయే నాలుగు నెలల పాటు ఢిల్లీ ప్రభుత్వాన్ని నడిపిస్తాను తెలిపింది. అరవింద్ కేజ్రీవాల్‌పై తప్పుడు కేసులు పెట్టి, అరెస్టు చేసి ఆరు నెలలు జైలులో ఉంచిన.. ఢిల్లీ ప్రజలు ఆయన నిజాయితీపై నమ్మకం ఉంచారని వెల్లడించింది. ఢిల్లీ సీఎం పీఠం అరవింద్ కేజ్రీవాల్‌కే చెందుతుంది.. ప్రజలు మళ్లీ ఆయనను ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటారని అతిషీ మర్లెనా వ్యాఖ్యనించింది.

( మొదటి పేజీ తరువాయి )

# కాంగ్రెస్‌ది ప్రజాపాలన కాదు గుండా రాజ్యం నడుస్తుంది

మొన్న సిద్దిపేటలో నా కార్యాలయం మీద దాడి కావచ్చు, హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటి మీద దాడి కావచ్చు, నిన్న సునీత లక్ష్మారెడ్డి ఇంటి మీద దాడి కావచ్చు, రాష్ట్రంలో గూండాయిజం రాజ్యాన్ని తలపించే విధంగా పరిపాలన సాగుతుంది అని హరీశ్‌రావు తెలిపారు.

**కాంగ్రెస్ నాయకత్వం ప్రోత్సాహంతో జరిగిన దాడి**

తెలంగాణకున్న మంచి పేరును మంటగలిపి.. ఈరోజు బీహార్‌లాగా తెలంగాణను మారుస్తున్నారని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.నిన్న సునీతా లక్ష్మారెడ్డి మీద జరిగిన దాడి కాంగ్రెస్ నాయకత్వం ప్రోత్సాహంతో జరిగిన దాడి అని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి రెచ్చగొట్టే మాటలు రాష్ట్రంలోని కాంగ్రెస్ కార్యకర్తలను ప్రతిపక్షాల మీద దాడి చేసే విధంగా ప్రోత్సహించినట్లు ఉన్నాయి. ఎమ్మెల్యే నివాసంలో లేనప్పుడు ఉద్దేశపూర్వకంగా దాడి చేయాలని, ఎమ్మెల్యే ఇంటి ముందు పటాకులు కాల్చడం, ఇంట్లోకి పటాకులు విసరడము ఇంట్లో ఉన్న వారిపై దాడి చేయడం హేయమైన చర్య అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

**పోలీసులపై దాడి జరిగినా కేసు నమోదు చేయడం లేదు..**

ఇప్పుడే ఎస్పీ, ఐజీతో మాట్లాడాను.. వెంటనే కాంగ్రెస్ గూండాలను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేయడం జరిగిందని హరీశ్‌రావు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు దాడి చేశారన్న విషయం వీడియోలో స్పష్టంగా కనిపిస్తున్నది. అంతే కాకుండా విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్‌పై కూడా దాడి చేసే ప్రయత్నం చేశారు. హెడ్ కానిస్టేబుల్ చేతిలోని ఫోన్ లాక్కోని నెట్టేస్తే, ఆయన కింద పడిపోయాడు. పోలీసులపై దాడి జరిగినా కేసు నమోదు చేయడం లేదు. కాంగ్రెస్ రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు. దేశంలో తెలంగాణ పోలీసులు అంటే మంచి పేరు ఉండేది కానీ ఇప్పుడు రేవంత్ రెడ్డి పోలీసులను చెడగొడుతున్నారని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు.

**కాంగ్రెస్ ప్రభుత్వం, రేవంత్ రెడ్డి శాశ్వతం కాదు..**

పోలీసు అధికారులు ఒక విషయం గుర్తుపెట్టుకోండి ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం, రేవంత్ రెడ్డి శాశ్వతం కాదు. 10 సంవత్సరాలు బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉంది.. ఏనాడైనా ఎమ్మెల్యేల ఇంటిపైన దాడి జరిగిందా? ఫిర్యాదు ఇచ్చిన 24 గంటల్లో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సందర్భాలు ఉన్నాయి. కాంగ్రెస్ గూండాల రాజ్యంలో ఎఫ్ఐఆర్ ఫైల్ చేయరు.. దాడి చేసిన వారిని అరెస్ట్ చేయరు. వెంటనే గోమారంలో దాడి చేసిన కాంగ్రెస్ గుండాలను అరెస్ట్ చేయాలి. దాడిని ప్రోత్సహించిన వారిపై కూడా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నామని హరీశ్‌రావు తెలిపారు.

**రాయలసీమ లాంటి ఫ్యాక్షన్ పరిస్థితులు తెలంగాణలో..**

నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్, స్టేట్ హ్యూమన్ రైట్స్ కమిషన్‌కి కూడా వెళ్తాం. దాడి చేసిన వారికి శిక్ష పడేదాకా వదిలిపెట్టం.ఇది ప్రజా పాలన కాదు గూండాల పాలన. మా ఓపికకు కూడా ఒక హద్దు ఉంటది. పోలీసులు ఇలాంటి



దాడులను కట్టడి చేయడంలో విఫలమైతే రాయలసీమ లాంటి ఫ్యాక్షన్ పరిస్థితులు తెలంగాణలో కూడా వచ్చే అవకాశం ఉంది. తెలంగాణ ప్రాంతంతో, తెలంగాణ ప్రజలతో మాది పేగు బంధం. ఎక్కడ ఎలాంటి హింసాత్మక ఘటనలు జరగకుండా మేము చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాం. అదేవిధంగా ప్రభుత్వం పోలీసులు కూడా వ్యవహరిస్తే మంచిది. ఇంట్లో చొరబడి దాడి చేసిన వారిని అరెస్టు చేసి రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ సక్రమంగా ఉందని నిరూపించుకోవాలి. డిజిపి పదవికి గౌరవం తెచ్చే విధంగా చట్టానికి వ్యతిరేకంగా ఎవరు వెళ్లిన వారిని ఉపేక్షించవద్దు అని సూచిస్తున్నాను. ఈ ఘటనపై డీజీపీ వెంటనే స్పందించి దాడి చేసిన వారిని అరెస్ట్ చేయవలసిందిగా డిమాండ్ చేస్తున్నాను. ఒకవేళ అరెస్టు చేయనట్టయితే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి డీజీపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హరీశ్‌రావు హెచ్చరించారు.

## గాంధీ ఆసుపత్రి వద్ద ఉద్రిక్తత - బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

ఈ క్రమంలో అక్కడ ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి.మాజీ ఉపముఖ్యమంత్రి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ రాజయ్య అధ్యక్షతన ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌లతో రాష్ట్రంలో వైద్య, ఆరోగ్య సేవలపై బీఆర్ఎస్ ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ముందుగానే బీఆర్ఎస్ నేతలు గాంధీ ఆసుపత్రికి వస్తున్నారన్న సమాచారంతో పోలీసులు భద్రతను పెంచారు. ఆసుపత్రిలోకి బీఆర్ఎస్ నాయకులను రానివ్వకుండా కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు.ముందుగా తెలంగాణ భవన్‌కు చేరుకున్న నేతల కమిటీ మాట్లాడుతూ, ఆసుపత్రులపై అధ్యయనం చేస్తామంటే ప్రభుత్వం ఎందుకు భయపడుతుందని ప్రశ్నించారు. తమ నేతలు గాంధీ ఆసుపత్రికి వెళ్తామంటే భయమెందుకని అడిగారు. గాంధీ ఆసుపత్రిలో మాతాశిశు మరణాలను ప్రభుత్వం దాస్తుందా అని ప్రశ్నించారు. ఈ విషయంలో ప్రభుత్వ వైఫల్యం ఏమైనా బయటపడుతుందని భయపడుతున్నారా అంటూ నిలదీశారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఇలాంటి చర్యలు ఆపాలని డిమాండ్ చేశారు.**అరెస్టు చేయడం దారుణం :** మాతాశిశు




మరణాలు ఎందుకు పెరిగాయి అనే విషయం అడిగేందుకు వెళ్తే అరెస్టు చేయడం దారుణమని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ఆవేదన చెందారు.నిర్మాణాత్మకమైనఅంశాలపైనే పోరాడుతున్నామన్నారు. గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ తో కూర్చుని మాట్లాడాలని వస్తే అరెస్టు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజల సమస్య తెలుసుకోవాలని సీఎం అన్నారని ప్రతిపక్ష బాధ్యతగా అదే పని చేస్తున్నామని పేర్కొన్నారు. కానీ అక్రమ అరెస్టులతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని ధ్వజమెత్తారు. గాంధీ ఆసుపత్రిలో ప్రొఫెసర్లు, సీనియర్లు, స్టాఫ్ కొరత ఉందని తెలిపారు.

## వన్ స్టేట్, వన్ డిజిటల్ కార్డులు

రాష్ట్రంలో కుటుంబ డిజిటల్ కార్డుల జారీకి కార్యచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. డిజిటల్ కార్డులపై మంత్రులు దామోదర రాజనర్సింహా, ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులతో సీఎం సమక్ష నిర్వహించారు. కుటుంబ డిజిటల్ కార్డుల జారీ కోసం ప్రతీ నియోజకవర్గంలో ఒక పట్టణం, ఒక గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు.పథకాలన్నింటికీ వన్ కార్డు : రాష్ట్రంలో వన్ స్టేట్, వన్ డిజిటల్ కార్డు విధానం అమలు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. రేషన్, ఆరోగ్య సేవలతో పాటు సంక్షేమ పథకాలన్నీ ఒకే కార్డు ద్వారా అమలు చేసేలా ప్రణాళిక చేస్తోంది. కుటుంబ డిజిటల్ కార్డు ద్వారా రాష్ట్రంలో ఎక్కడైనా సంక్షేమ పథకాలు పొందేలా ప్రణాళిక చేయాలని సీఎం



సూచించారు. డిజిటల్ కార్డులో కుటుంబ సభ్యులందరి హెల్త్ ప్రొఫైల్ పొందుపరిచి, దాని ద్వారానే ఆరోగ్య సేవలు అందించాలన్నారు. అర్హులందరికీ కుటుంబ డిజిటల్ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని, జిల్లాల వారీగా ప్రత్యేక వ్యవస్థ ఉండాలని సీఎం సూచించారు. రాజస్థాన్, హర్యానా, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో అమలులో ఉన్న విధానాలను అధ్యయనం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

## కావూరి హిల్స్‌పైకి 'హైడ్రా' బుల్డోజర్లు - నేలమట్టమైన అక్రమ నిర్మాణాలు

**శాసనసభ / హైదరాబాద్:** హైదరాబాద్ మాదాపూర్ లోని కావూరి హిల్స్‌లో హైడ్రా బుల్డోజర్లకు పని చెప్పింది. కావూరి హిల్స్ పార్కులోని అక్రమ షెడ్లను కూల్చేసింది. గడువు తీరకముందే స్పోర్ట్స్ అకాడమీని అన్యాయంగా కూల్చేశారని నిర్వాహకులు ఆరోపించారు. కాగా కావూరి హిల్స్ ప్రాంతంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ వివరణ ఇచ్చారు.రాజధాని పరిధిలో ప్రభుత్వ భూములు, చెరువుల పరిరక్షణనే లక్ష్యంగా అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చేస్తోంది. ఆదివారం నుంచి కూల్చివేతల్లో నిమగ్నమైన హైడ్రా బుల్డోజర్లు ఇవాళ కూడా ఆక్రమణల అంతు చూస్తున్నాయి. సోమవారం (సెప్టెంబరు 23వ తేదీ) మాదాపూర్‌లోని కావూరి హిల్స్ పార్కు స్థలంలోని అక్రమ షెడ్లను హైడ్రా కూల్చేసింది.పార్కు స్థలంలో స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేశారు. ఈ స్పోర్ట్స్ అకాడమీపై కావూరి హిల్స్ అసోసియేషన్ హైడ్రాకు ఫిర్యాదు చేసింది. కావూరి హిల్స్ అసోసియేషన్ ఫిర్యాదుతో అక్రమ షెడ్లను కూల్చేశారు. ఈ అక్రమ నిర్మాణాలను తొలగించి కావూరిహిల్స్ పార్కు పేరిట బోర్డును ఏర్పాటు చేశారు. పార్కు స్థలాన్ని 25 ఏళ్లు లీజుకు తీసుకున్నామని స్పోర్ట్స్ అకాడమీ నిర్వాహకులు తెలిపారు. గడువు తీరకముందే అన్యాయంగా నిర్మాణాలు తొలగించారని ఆరోపించారు.హైకోర్టు ఆదేశాల మేరకు



ఆక్రమణలు కూల్చివేశాం : హైకోర్టు ఆదేశాల మేరకు కావూరిహిల్స్‌లో పార్కు ప్రదేశాన్ని ఆక్రమించి నిర్మించిన కట్టడాలను తొలగించినట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. ఈ మేరకు కావూరి హిల్స్ పార్క్ కూల్చివేతలకు సంబంధించి ఆయన వివరణ ఇచ్చారు.కావూరిహిల్స్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఈ విషయంలో హైకోర్టును ఆశ్రయించిందని, పార్క్ లేఔట్ స్థలంలో ఆక్రమణలు తొలిగించాలని హైకోర్టు ఆదేశించినట్లు తెలిపారు. జీహెచ్ఎంసీ సర్కిల్ టౌన్ ప్లానింగ్ విభాగం అభ్యర్థన మేరకు హైడ్రా కావూరి హిల్స్ పార్క్‌లోని 3 షెడ్లు, టెన్నిస్ కోర్టును కూల్చివేసినట్లు రంగనాథ్ తెలిపారు. 2 వేల చదరపు గజాల స్థలాన్ని స్వాధీనం చేసుకొని పార్క్ అభివృద్ధి కోసం జీహెచ్ఎంసీ సర్కిల్ అధికారులకు అప్పగించినట్లు రంగనాథ్ స్పష్టం చేశారు.

## మోదీ మాకు సవాల్ విసిరారు.. భారత ప్రధానితో భేటీపై సుందర్ పిచాయ్ వ్యాఖ్య




మీలో కొందరితో సమావేశమయ్యే అవకాశం లభించింది. మరోసారి ప్రపంచంలో ప్రముఖ ఆవిష్కర్తలతో కూర్చోవడం గర్వంగా ఉంది. భారత్‌పై మీకున్న ఉత్సాహం, నమ్మకం మాకు ఎంతో సంతోషాన్ని ఇస్తున్నాయి. మీరు ఇచ్చిన సూచనలు ఎంతో విలువైనవి" అని అన్నారు.అనంతరం గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ మాట్లాడుతూ.. "భారత్‌ను మార్చడంపై ప్రధాని మోదీ దృష్టి సారించారు. ఇది డిజిటల్ ఇండియా విజన్. భారత్‌లోనే తయారీ, డిజైనింగ్ ఉండాలని ఆయన మమ్మల్ని అడిగారు. ఇప్పుడు మా పిక్సెల్ ఫోన్లను భారత్‌లో తయారుచేయడం గర్వంగా ఉంది. ఏఐతో భారత ప్రజలకు లభించే ప్రయోజనాల గురించి మోదీ ఆలోచిస్తున్నారు. ఈ సరికొత్త సాంకేతికతను విద్య, వైద్యం, వ్యవసాయం వంటి రంగాల్లో ఉపయోగించేలా ఆలోచించేలా ఆయన మాకు సవాలు విసిరారు. భారత్‌లో ఏఐ మరింత విస్తరించేలా మేం ముందుకువెళ్తున్నాం. మోదీ స్పష్టమైన విజన్‌తో ఆలోచనలు చేస్తున్నారు" అని పిచాయ్ అన్నారు.గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్, అడోబ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శంతను నారాయణ్, ఎన్విడియా సీఈవో జెన్‌సెన్ హాంగ్ సహా 15 కంపెనీల సీఈవోలు ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. దీనికి సంబంధించిన ఫొటోను ప్రధాని మోదీ తన 'ఎక్స్' ఖాతాలో పంచుకున్నారు. సీఈవోలతో ఫలప్రదమైన చర్చలు జరిగాయని, టెక్నాలజీ, ఇన్నోవేషన్ అంశాల గురించి చర్చించామని తెలిపారు. 'మేడ్ బై ఇండియా' గురించి ప్రత్యేకంగా ప్రస్తావించినట్లు వెల్లడించారు.

## మంత్రి పొన్నంకు మోడల్ స్కూల్ విద్యార్థుల ధన్యవాదాలు



**శాసనసభ / హైదరాబాద్:** హనుమకొండ జిల్లా పర్యటనకు వెళ్లి వస్తున్న తెలంగాణ బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ను మార్గమధ్యంలో మోడల్ స్కూల్ విద్యార్థులు కలిశారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నంకు విద్యార్థులు అభినందనలు తెలియజేశారు. పలు కార్యక్రమాల్లో భాగంగా కాంగ్రెస్ నేత పొన్నం ప్రభాకర్ హనుమకొండ జిల్లాలో పర్యటించారు. అనంతరం తిరుగు ప్రయాణంలో గోపాల్ పూర్ నుంచి ఎల్కతుర్తి వెళుతూ మార్గమధ్యంలో రోడ్డు మీద ఉన్న బస్సు కోసం వేచి చూస్తున్న ఎల్కతుర్తి మోడల్ పాఠశాల విద్యార్థులను చూసి కారు ఆపారు. వారితో వెళ్లి ముచ్చటించారు.గతంలో మోడల్ స్కూల్ విద్యార్థులకు ప్రత్యేక బస్సులు అడిగినపుడు విద్యార్థుల సమయానికి రెండు బస్సులు వేయడంతో సమస్య తీరిందని విద్యార్థులు మంత్రికి తెలిపారు. బస్సులు ఏర్పాటు చేసిన పొన్నంకు విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పొన్నం మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదువుకోవాలని, స్కూల్ లో ఉన్న అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అంతేగాక త్వరలోనే మోడల్ స్కూల్ ను సందర్శిస్తానని మంత్రి తెలిపారు.

## లడ్డూ వివాదం, కేంద్ర ప్రభుత్వం ఎంట్రీతో మైండ్ బ్లాక్, షోకాజ్ నోటీసులు



**శాసనసభ / న్యూఢిల్లీ :** తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదం కల్తీపై కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ చాలా సీరియస్ అయ్యింది. తిరుమల లడ్డూల తయారి కోసం సరఫరా చేసే నెయ్యి తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించని తమిళనాడుకు చెందిన ఏఆర్ కంపెనీకి కేంద్ర ప్రభుత్వం షోకాజ్ నోటీసులు జారీ చేసింది.తమిళనాడుకు చెందిన ఏఆర్ కంపెనీకి కేంద్ర ప్రభుత్వం నోటీసులు ఇవ్వడంతో ఇప్పుడు ఈ వివాదం కొత్త మలుపు తిరిగింది.తిరుమల లడ్డూ ప్రసాదం వివాదం నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య శాఖ విచారణ చేపట్టింది. ఈ క్రమంలో శ్రీవెంకటేశ్వర స్వామి వారి లడ్డూ ప్రసాదం తయారీకి నెయ్యి సరఫరా చేసే నాలుగు కంపెనీలకు చెందిన నెయ్యి నమూనాలను కేంద్ర ప్రభుత్వం సేకరించింది. ఈ మేరకు ఆ నెయ్యి నాణ్యతపై పరీక్షలు నిర్వహించింది. వాటిలో తిరుమలకు నెయ్యి పరఫరా చేసిన మూడు కంపెనీలు సరైన ప్రమాణాలు పాటించినట్లు కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య శాఖ గుర్తించింది.అయితే తమిళనాడుకు చెందిన ఏఆర్ కంపెనీ మాత్రం నెయ్యి నాణ్యతా పరీక్షల్లో ఫెయిల్ అయ్యిందని కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది. ఈ మేరకు సరైన ప్రమాణాలు పాటించకుండా కల్తీ నెయ్యి తిరుమల శ్రీవారి లడ్డూలు తయారు చెయ్యడానికి సరఫరా చేస్తున్న ఆ కంపెనీకి ఫుడ్ స్టాండర్డ్స్ సేఫ్టీ అథారిటీ ఆఫ్ ఇండియా షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ విషయంపై ఏఆర్ కంపెనీ యాజమాన్యం ఎలా స్పందిస్తుంది, ఏం చెబుతుంది అంటూ కోట్లాది మంది శ్రీవారి భక్తులు వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు.కమీషన్ల కోసం కక్కుర్తిపడిన వైసీపీ నాయకులు తిరుమలకు నెయ్యి సరఫరా చెయ్యడానికి కాంట్రాక్టులు ఇచ్చారని కూటమి ప్రభుత్వంలోని పలువురు నాయకులు ఆరోపిస్తున్నారు. అప్పటి టీటీడీ బోర్డుకు చెందిన కొందరు నెయ్యి కాంట్రాక్టులతో కుమ్మక్కు అయ్యారని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో పాటు ప్రజలు కూడా ఆరోపిస్తున్నారు. ఇలాంటి సమయంలో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ జోక్యం చేసుకుని నెయ్యి నమూనాలు సేకరించి వాటిని పరీక్షించి ఏఆర్ కంపెనీకి షోకాజ్ నోటీసులు ఇవ్వడం ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యింది.

## తెగుళ్ల నివారణకు రైతులకు సూచనలివ్వండి.. అధికారులకు తుమ్మల ఆదేశం



ఇటీవల కురిసిన వర్షాల దృష్ట్యా పంటల్లో చీడపీడలు, తెగుళ్ల బెడద పెరగడంతో వ్యవసాయశాఖ అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అప్రమత్తం చేశారు. వరిలో బ్యాక్టీరియా ఎండాకు తెగులు, పత్తిలో రసం పీల్చే పురుగులు, మెగ్నీషియం లోపం ఉన్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా అధికారులు, శాస్త్రవేత్తలతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించాలని తుమ్మల ఆదేశించారు.తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు సూచనలివ్వాలని చెప్పారు.ఈ మేరకు వ్యవసాయ శాఖ డైరెక్టర్, జయశంకర్ వర్సిటీ పరిశోధన సంచాలకుడికి ఆదేశాలు జారీ చేశారు. వ్యవసాయశాఖ అధికారులు, వర్సిటీ శాస్త్రవేత్తలు బృందాలుగా ఏర్పడి 3, 4 రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, రైతులకు చీడపీడలు, పురుగుల నివారణ కోసం సలహాలు, సూచనలు ఇవ్వాలని మంత్రి ఆదేశించారు.

## సరిహద్దు రాష్ట్రాలపై గట్టి నిఘా




**శాసనసభ / హైదరాబాద్:** పకడ్బందీగా మానిటరింగ్ చేయాల్సిన బాధ్యత అధికారులదేనని నొక్కి చెప్పారు. సోమవారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ లో 2023-24 ఖరీఫ్ పంట కొనుగోలుపై రాష్ట్రంలోని జాయింట్ కలెక్టర్లు, జిల్లా పౌర సరఫరాల అధికారులు, జిల్లా స్థాయి పౌర సరఫరాల శాఖా మేనేజర్లతో మంత్రి ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 7,139 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేశామన్నారు. సన్నాలకు, దొడ్డు వడ్లకు వేరు వేరుగా కొనుగోలు కేంద్రాలు ఉన్నాయన్నారు. ఖరీఫ్ లో 60 లక్షల 39 వేల ఎకరాల్లో ధాన్యం సాగు జరిగిందన్నారు. 146 లక్షల 28 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా వేశామన్నారు. 91 లక్షల 28 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదన్నారు. మొట్టమొదటి సారిగా 40 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వకు గోడౌన్ ల ఏర్పాటు చేశామన్నారు. అయితే ఎట్టి పరిస్థితుల్లో డిఫాల్టర్ మిల్లర్లకు ధాన్యం ఇచ్చేది లేదని తేల్చి చెప్పారు.ప్రభుత్వం ఆశించిన మేరకు సన్నాల దిగుబడి ఉన్నదని, 36 లక్షల 80 వేల ఎకరాల్లో సన్నాలు సాగు అవుతున్నాయన్నారు. 88 లక్షల 9 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా వేశామన్నారు. ఖరీఫ్ నుండి సన్నాలకు 500 బోనస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయం విప్లవాత్మకమైనదని, సరిహద్దు రాష్ట్రాల నుండి వచ్చే ధాన్యాన్ని కొనుగోలు చేస్తే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. ధాన్యం కొనుగోలులో అధికారులదే కీలక పాత్ర అని మంత్రి వెల్లడించారు. ఖరీఫ్ లో సేకరించిన సన్నాలతో జనవరి నుండి చౌక ధరల దుకాణాలలో సన్న బియ్యం పంపిణీ జరుగుతుందన్నారు. గత ప్రభుత్వ హయంలో అవకతవకలు జరిగాయని, ఇప్పుడు అలాంటి పరిస్థితులు రాకూడదని స్పష్టం చేశారు. ప్రజల సొమ్ముతో అప్పు చేసి కొనుగోలు చేస్తున్న ధాన్యం అంశంలో ఎలాంటి నిర్లక్ష్యం జగరగవద్దన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్ చవాన్, జాయింట్ సెక్రటరీ ప్రియాంక అలా, స్టేట్ వేర్ హౌసింగ్ కార్పోరేషన్ ఎండీ లక్ష్మి, మార్కెటింగ్ డైరెక్టర్ ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్ కి పొంగులేటి సవాల్.. బావా బామ్మర్దుల మధ్య విభేదాలు అందరికి తెలుసు



**శాసనసభ / హైదరాబాద్:** బీఆర్ఎస్ లో ఉన్న బావా బామ్మర్దుల మధ్య ఉన్న అనుబంధం ఏంటో వారి మధ్య ఉన్న విభేదాలు ఇంటిలో వారు ఎప్పుడూ ఎక్కడా వెన్నుపోట్లు పడుకుంటారో ప్రజలందరికీ తెలుసు అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.నువ్వు నీ పింక్ కలర్ పేపర్లు నీ పింక్ కలర్ యూట్యూబ్ ర్లు నామీద దుష్ప్రచారం చేస్తున్నారు .నేను సవాల్ చేస్తున్నాను నేను ఎఫ్ తో ఎల్ లో ఇల్లు కట్టుకున్నానని చేస్తున్న ఆరోపణలు నిరూపించు.. బావా బామ్మర్దులు ఇద్దరు టేపు పట్టుకొని వచ్చి నిరూపించండి సవాల్ చేస్తున్నా అంటూ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి కేటీఆర్ కు సవాల్ విసిరారు%ొ% సృజన్ రెడ్డి అనే కాంట్రాక్టర్ నామీద పోటీ చేసిన బిఆర్ఎస్ అభ్యర్థి కందాల ఉపేంద్రరెడ్డి సొంత అల్లుడని ఆయనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బావమరిదిగా చిత్రీకరించడం కోసం బిఆర్ఎస్ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. సృజన్ రెడ్డికి గత ప్రభుత్వంలో మీరు కాంటాక్ట్ పనులు ఇచ్చింది నిజం కాదా అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీద మీరు చేసిన విమర్శలకి చాలెంజ్ చేస్తే ఆ చాలెంజ్ లకి సవాల్ కి కేటీఆర్ సిద్ధం కాలేక పోయారు.రాబోయే ఎన్నికల్లో ఇప్పుడు వచ్చిన కొద్ది పాటి ఓట్లు కూడా మీకు రావు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దించడానికి శ్రీనివాసరెడ్డి పొందిన పన్నాగామంట.. నీ బుర్ర ఎక్కడ ఉండాల్సిందో.. ఎక్కడుందో ప్రజలు గమనిస్తున్నారు అంటూ కేటీఆర్ ను ఉద్దేశించి ఎద్దేవా చేశారు.. బావా బామ్మర్దుల మధ్య ఉన్న గ్యాప్ ఏందో ప్రజలందరికీ తెలుస్తూనే ఉంది.. మి మధ్య ఉన్న ఐక్యత ఏమిటో మీ పార్టీ నాయకులకు తెలుసు.. ఎవరు ఎప్పుడు ఎలా వెన్నుపోటు పొడిచుకుంటారో ప్రజలందరికీ తెలుసు.. చూస్తూనే వున్నారు. మా ముఖ్యమంత్రిని మా మంత్రులని మీరు విమర్శించే ముందు మీ పార్టీని చక్కబెట్టుకోండి అని కేటీఆర్ కి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సవాల్ విసిరారు..

## హైడ్రాకు హైకోర్టు కీలక ఆదేశాలు..!!




**శాసనసభ / హైదరాబాద్:** ఆక్రమణ కూల్చివేతలపై దూసుకెళ్తున్న హైడ్రాకు హైకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. దుర్గం చెరువు పరిసరాల్లో హైడ్రా కూల్చివేతలపై న్యాయస్థానం స్టే విధించింది.స్థానికుల పిటిషన్ పైన హైకోర్టు విచారణ చేసింది. 2014లో జారీ చేసిన ప్రిలిమినరీ నోటిఫికేషన్ పైన అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ పిటిషన్ దాఖలు అయింది. దీంతో హైకోర్టు హైడ్రాకు కీలక సూచనలు చేసింది.దుర్గం చెరువును ఆక్రమించి నిర్మాణాలు చేశారంటూ హైడ్రా స్థానికులకు నోటీసులు జారీ చేసింది. నెల రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని స్పష్టం చేసింది. ఈ నోటీసుల పైన స్థానికులు హైకోర్టును ఆశ్రయించారు. 2014లో జారీ చేసిన ప్రిలిమరి నోటిఫికేషన్ పై దుర్గం చెరువు పరిసర నివాసితులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. వీటిని పరిగణలోకి తీసుకున్న న్యాయస్థానం ప్రొటెక్షన్ కమిటీ స్థానికుల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోవాలని సూచించింది. అక్టోబర్ 4న ప్రొటెక్షన్ కమిటీ ముందు నివాసితులు హాజరు కావాలని కోర్టు పేర్కొంది.అదే సమయంలో అక్టోబర్ 4 నుంచి ఆరు వారాల లోపు నోటిఫికేషన్ జారీ చేయాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. కోర్టు తాజా ఆదేశాలతో దుర్గం చెరువు నివాసితులకు తాత్కాలికంగా ఊరట దక్కింది. మరోవైపు నగరంలో హైడ్రా కూల్చివేతలు కొనసాగుతున్నాయి. ఈరోజు మాదాపూర్ లో హైడ్రా సిబ్బంది కావూరి హిల్స్ పార్కు స్థలంలో వెలసిన అక్రమ షెడ్లను కూల్చివేశారు.పార్కులో స్పోర్ట్స్ అకాడమీపై గత కొంతకాలంగా కావూరి హిల్స్ అసోసియేషన్ ఫిర్యాదులు చేసింది. దీంతో తక్షణమే రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు ముందుగా స్పోర్ట్స్ అకాడమీ నిర్మాణాలను తొలగించారు. అనంతరం కావూరి హిల్స్ పార్క్ అని అధికారులు బోర్డును ఏర్పాటు చేశారు. అయితే కావూరి హిల్స్ అసోసియేషన్ నుంచి 25 ఏళ్ల పాటు తాము లీజుకు తీసుకున్నామని స్పోర్ట్స్ అకాడమీ నిర్వాహకులు వాదిస్తున్నారు. గడువు ముగీకముందే అన్యాయంగా నిర్మాణాలను తొలగిస్తున్నారని ఆరోపిస్తున్నారు. తాజాగా హైకోర్టు హైడ్రాకు ఇచ్చిన ఆదేశాలతో దుర్గం చెరువు వాసులకు రిలీఫ్ దక్కింది.

## స్వచ్ఛతా సేవా కార్యక్రమాన్ని యజ్ఞంలా చేయండి : అధికారులకు మంత్రి సీతక్క ఆదేశం



**శాసనసభ / హైదరాబాద్:** పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖలో విభాగాల వారిగా పనుల్లో వేగం పెంచాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. విభాగాల వారిగా జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. సచివాలయంలో సోమవారం నాడు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, సెర్ప్ సీఈఓ దివ్యా దేవ రాజన్, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమీషనర్ అనితా రామచంద్రన్, స్పెషల్ కమీషనర్ షఫిఉల్లాతో కలిసి మంత్రి సీతక్క సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ... బీఆర్ఎస్ హయంలో పెండింగ్ ఉంచిన బిల్లులను త్వరలో చెల్లిస్తామని చెప్పారు. ఆయా విభాగాల్లో కొనసాగుతున్న పనుల పురోగతిని తెలుసుకున్నారు.విభాగాల వారిగా నూతన పనులకు కార్యచరణ సిద్దం చేసి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. హెచ్ఓడీలతో సమీక్ష అనంతరం డీఆర్డీఓ, అడిషన్ డీఆర్డీఓ, డీపీఓలతో మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామల్లో స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమానికి కొనసాగింపుగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. అధికారులంతా జవాబుదారీగా వ్యవహరించాలని కోరారు.జిల్లాల్లో ప్రతిరోజు చేపట్టిన కార్యక్రమాల వివరాలను అన్ లైన్ లో ఎంట్రీ చేయాలన్నారు. రాబోయే పది రోజుల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని ఒక యజ్ఞంలా కొనసాగించాలని ఆదేశాలు జారి చేశారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో స్థానిక ప్రజలతో పాటు ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యం పెంచాలని కోరారు. జాతీయ స్థాయిలో స్వచ్ఛతా హీ సేవా విభాగంలో రాష్ట్రాన్ని అగ్ర స్థానంలో నిలిపేలా కృషి చేయాలని ఆదేశించారు.గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి మంచి సరఫారా విషయంలో నూతన ఒరవడికి తమ ప్రభుత్వం నాంది పలికిందని తెలిపారు. ప్రతి గ్రామంలో గ్రామ మంచినీటి సహాయకుడిని నియమించి శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. 15 జిల్లాల్లో 60 ప్రాంతాల్లో శిక్షణ కొనసాగుతుందని.. ఈ నెల లోపు అన్ని గ్రామాలకు సహాయకులను నియమించి శిక్షణ పూర్తి చేస్తామన్నారు. తాగునీటి నాణ్యతను నిర్వహించడంతోపాటు బోర్లు పాడైతే అదే రోజు మరమ్మత్తులు జరిగేలా, పైపులు లీకైతే సరిచేసేలా గ్రామాల్లో మంచినీటి సహాయకులు కృషి చేస్తారని తెలిపారు.

## తెలంగాణలో త్వరలోనే మరో కొత్త రాజకీయ పార్టీ



**శాసనసభ / హైదరాబాద్:** తెలంగాణలో రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. ఇప్పటికే ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీతో పాటు ఎంఐఎం, టీజేఎస్, కమ్యూనిస్ట్ లాంటి పార్టీలు ఉండగా..ఇంకా చిన్న చిన్న పార్టీలు చాలానే ఉన్నాయి. కాగా.. ఇప్పుడు మరో కొత్త రాజకీయ పార్టీ పురుడుపోసుకునే అవకాశం ఉంది. అది కూడా బీసీ నినాదంతో రానున్నట్టు తెలుస్తోంది.ఈ మేరకు.. రాజ్యసభ ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు కొత్త చర్చకు తెరతీశాయి. త్వరలో.. స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఆర్ కృష్ణయ్య వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.

## సరికొత్త రికార్డులు సృష్టించిన స్టాక్ మార్కెట్



**శాసనసభ / హైదరాబాద్ :** దేశీయ స్టాక్ మార్కెట్ మరోసారి సరికొత్త రికార్డులను నమోదు చేశాయి. సెన్సెక్స్, నిఫ్టీ రెండూ సూచీలు కూడా జీవితకాల గరిష్టాలను నమోదు చేశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో మిశ్రమ ఫలితాలు ఉన్నప్పటికీ మన మార్కెట్ మాత్రం శుక్రవారం ప్రదర్శించిన దూకుడునే సోమవారం చూపించింది.సోమవారం మార్కెట్ ప్రారంభంలోనే సెన్సెక్స్ 151 పాయింట్లు లాభపడి 84, 695 మార్కు క్రాస్ అయి రికార్డ్ సృష్టించింది. అలాగే నిఫ్టీ కూడా 84 పాయింట్లు లాభపడి 25, 875 దగ్గర ట్రేడ్ అవుతూ జీవితకాల గరిష్టాన్ని సొంతం చేసుకుంది. ఇక ముగింపులో సెన్సెక్స్ 384 పాయింట్లు లాభపడి 84, 928 దగ్గర ముగియగా.. నిఫ్టీ 148 పాయింట్లు లాభపడి 25, 939 దగ్గర ముగిసింది. ఇక రూపాయి మారకం విలువ డాలర్‌తో పోలిస్తే రూ. 83.55 దగ్గర ఫ్లాట్‌గా ముగిసింది.నిఫ్టీలో ఎమ్ అండ్ ఎమ్, ఒఎన్‌జీసీ, బజాజ్ ఆటో, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, హీరో మోటోకార్ప్ లాభపడగా.. ఐషర్ మోటార్స్, దివీస్ ల్యాబ్స్, ఐసీఐసీఐ బ్యాంక్, టెక్ మహీంద్రా, ఇండస్‌ఇండ్ బ్యాంక్ నష్టపోయాయి. సెక్టార్లలో పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 3 శాతం కంటే ఎక్కువ పెరిగింది. రియల్టీ ఇండెక్స్ 2 శాతానికి పైగా పెరిగింది. అయితే ఆటో, ఇంధనం, ఎఫ్‌ఎంసీజీ, మెటల్, ఫార్మా, మీడియా 0.5-1 శాతం పెరిగింది. అయితే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇండెక్స్ 0.5 శాతం క్షీణించింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఇండెక్స్‌లు 0.7 శాతం చొప్పున పెరిగాయి.

## యూట్యూబ్ ఛానళ్ళకు గుర్తింపు ఎలా?.. అక్రెడిటేషన్ కార్డుల జారీకి నిబంధనలేంటి?




**శాసనసభ / హైదరాబాద్:** కేంద్ర సమాచార ప్రసారాల మంత్రిత్వశాఖ (ఐ అండ్ బీ), రిజిస్ట్రార్ ఆఫ్ న్యూస్ పేపర్స్ ఫర్ ఇండియా (ఆర్ఎన్ఐ) తదితర ప్రభుత్వ సంస్థల నుంచి రిజిస్ట్రేషన్లు చేసుకోని యూట్యూబ్ ఛానెళ్ళ గుర్తింపు కోసం తెలంగాణ మీడియా అకాడమీ కసరత్తు మొదలుపెట్టింది.ఈ ఛానెళ్ళను గుర్తించాలంటే ఏయే అంశాలను ప్రామాణికంగా తీసుకోవాలని సీనియర్ పాత్రికేయులతో పాటు ఆ ఛానెళ్ళ ప్రతినిధుల అభిప్రాయాలను సేకరిస్తున్నది. అందులో తొలి మెట్టుగా రౌండ్ టేబుల్ సమావేశాన్ని సోమవారం నిర్వహించింది. పత్రికలకు ఆర్ఎన్ఐ సర్టిఫికేషన్ గుర్తింపుగా ఉంటుందని, టీవీ ఛానెళ్ళకు ఐ అండ్ బీ లైసెన్స్ ఒక సర్టిఫికేషన్‌గా పనిచేస్తుందని, అదే తరహాలో యూ ట్యూబ్ ఛానెళ్ళకు ప్రభుత్వ గుర్తింపు ఉండాలంటే పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాలపై చర్చను లేవనెత్తింది. అనేక రకాల అభిప్రాయాలు వ్యక్తం కావడంతో వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి... మరికొన్ని సమావేశాలు నిర్వహించిన తర్వాతనే స్పష్టత వస్తుందని తెలిపారు.యూట్యూబ్ ఛానెళ్ళను గుర్తించడంతో పాటు అందులో పనిచేస్తున్నవారు జర్నలిస్టులు అయినందున ప్రభుత్వం నుంచి జారీ అయ్యే అక్రెడిటేషన్ కార్డుల జారీకి అనుసరించాల్సిన విధివిధానాలపైనా ఈ సమావేశంలో చర్చ జరిగింది. కంపెనీ యాక్ట్ కింద ఆ యూ ట్యూబ్ ఛానెళ్ళు రిజస్టర్ కావాలి... ప్రభుత్వం విభాగంలో విధిగా రిజిస్ట్రేషన్ తీసుకోవాలి... లేబర్ డిపార్టుమెంటులో రిజిస్ట్రేషన్‌తో పాటు ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి... పోస్టల్ లైసెన్స్ ఉండాలి... రిజిస్టర్డ్ ట్రేడ్ మార్క్ లైసెన్స్ కలిగి ఉండాలి... జీఎస్టీ రిజిస్ట్రేషన్‌తో పాటు క్రమం తప్పకుండా రిటన్‌లు సమర్పిస్తూ ఉండాలి... నిబంధనలకు అనుగుణంగా ఆఫీస్ సెటప్ ఉండాలి... లేబర్ రూల్స్ ప్రకారం సిబ్బంది నియామకాలు, పేమెంట్స్, పీఎఫ్ ఖాతా తదితరాలు ఉండాలి... ఇలాంటి అనేక రకాల అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ప్రస్తుతం పత్రికలు, టీవీ ఛానెళ్ళకు ఉన్నట్లుగా వెబ్‌సైట్ నిర్వహించుకోడానికి నిబంధనలు ఉన్నట్లుగానే యూ ట్యూబ్ ఛానెళ్ళకు కూడా నిర్దిష్టమైన విధానాలు అమలు కావాలని పలువురు పేర్కొన్నారు.ఇదే సమయంలో ఇలాంటి ఆంక్షలు పెట్టడం ద్వారా భావ ప్రకటనా స్వేచ్ఛకు పరిమితులు విధించడమేననే అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని మరికొందరు వ్యాఖ్యానించారు. వార్తలు, చర్చాగోష్ఠులు, ఇంటర్వ్యూలు, ప్రత్యేక కథనాలు ప్రసారం చేస్తున్న యూ టూయబ్ ఛానెళ్ళలో కొన్ని రాజకీయ పార్టీలకు అనుకూలంగా, మరికొన్నింటికి వ్యతిరేకంగా ఉద్దేశపూర్వకంగా వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు ఉన్న నేపథ్యంలో స్వీయ నియంత్రణపైనా ఈ సమావేశంలో చర్చ జరిగింది. ఆ యూ ట్యూబ్ ఛానెళ్ళకు ఉండే సబ్‌స్క్రైబర్, వ్యూస్ గణాంకాలను ప్రధాన క్రైటేరియగా తీసుకోరాదని, ఈ రెండూ అంగట్లో సరుకుల్లాగా మారినందున అవి వాస్తవికతగా పరిగణనలోకి తీసుకోలేమన్న అభిప్రాయం కూడా వ్యక్తమైంది. ఎలాంటి చట్టబద్ధత లేకుండా యూట్యూబ్ ప్లాట్‌ఫామ్ మీద వేలాది ఛానెళ్లు ఉనికిలోకి వస్తున్నాయని, హద్దు అదుపూ లేకుండా చెలామణి అవుతున్నాయని, వాటికి ప్రభుత్వ గుర్తింపు ఇవ్వడం ద్వారా మీడియా వ్యవస్థకే మచ్చ కలుగుతుందని కూడా మరికొందరు అభిప్రాయపడ్డారు. యూట్యూబర్స్ చేస్తున్న ప్రసారాలు జర్నలిజం నైతిక ప్రమాణాలకు కట్టుబడి ఉండాల్సిన అవసరం ఉన్నదని వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో వ్యక్తమైన అన్ని వాదనలనూ పరిగణనలోకి తీసుకున్న మీడియా అకాడమీ... సమకాలీన పరిస్థితుల్లోని సామాజిక పరిణామాలను దృష్టిలో పెట్టుకుని అన్ని అభిప్రాయాలనూ పరిశీలించాల్సి ఉంటుందన్నారు.మొదటిసారి ఇలాంటి సమావేశాన్ని నిర్వహించడానికి చొరవ తీసుకున్న మీడియా అకాడమీని సీనియర్ పాత్రికేయులు, అభిప్రాయాలను వెలిబుచ్చిన జర్నలిస్టులు అభినందించారు. సియాసత్ మేనేజింగ్ ఎడిటర్ (ఎమ్మెల్సీ) ఆమెర్ ఆలీ ఖాన్, ఆంధ్రజ్యోతి ఎడిటర్ శ్రీనివాస్, ముఖ్యమంత్రి చీఫ్ పీఆర్వో అయోధ్యరెడ్డి, మీడియా అకాడమీ పూర్వాధ్యక్షులు అల్లం నారాయణ, సీనియర్ సంపాదకులు దిలీప్‌రెడ్డి, కట్టా శేఖర్‌రెడ్డి, జర్నలిజం ప్రొఫెసర్ పద్మజా షా, సీనియర్ పాత్రికేయులు ఎంఏ మాజీద్, కరుణాకర్ దేశాయ్, మార్కండేయ, భరత్, స్వరూప, జర్నలిస్ట్ యూనియన్ నాయకులు విరహత్ అలీ, సోమయ్య, పలు యూట్యూబ్ ఛానళ్ల ప్రతినిధులు, రాష్ట్ర సమాచార పౌర సంబంధాల విభాగం జాయింట్ డైరెక్టర్ జగన్, మీడియా అకాడమీ సెక్రటరీ వెంకటేశ్వరరావు, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

శాసనసభ

మంగళవారం 24 సెప్టెంబర్ - 2024

# 'దేవర' స్పెషల్ షోస్.. తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్




ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'దేవర' . జాన్వీకపూర్ హీరోయిన్.సైఫ్ అలీఖాన్ కీలక పాత్ర పోషించారు. సెప్టెంబర్ 27న ఇది ప్రేక్షకుల ముందుకురానుంది. చిత్ర బృందం విజ్ఞప్తి మేరకు.. ప్రత్యేక షోస్, టికెట్ ధరల పెంపునకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.29 థియేటర్లలో సినిమా విడుదల తొలి రోజు అర్ధరాత్రి 1 గంట స్పెషల్ షో, దాంతోపాటు అన్ని థియేటర్లలో 6 షోలు (4 గంటల నుంచి ప్రారంభం) ప్రదర్శించేందుకు వెలుసుబాటు కల్పించింది. ఆ స్పెషల్ షోలకు టికెట్ ధర రూ.100 పెంచుకునేందుకు అనుమతి ఇచ్చింది. ఈ నెల 28 నుంచి అక్టోబర్ 6 వరకు.. సింగిల్ స్క్రీన్ థియేటర్లలో రూ.25, మల్టీప్లెక్స్‌ల్లో రూ.50 పెంచుకునేందుకు అవకాశం కల్పించింది.'దేవర' స్పెషల్ షోలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే అనుమతి ఇచ్చిన సంగతి తెలిసిందే. తొలిరోజు అర్ధరాత్రి 12 గంటల షోతో పాటు ఆరు ఆటలకు అనుమతిచ్చింది. 28వ తేదీ నుంచి ఐదు ఆటలకు పర్మిషన్ ఇచ్చింది. అలాగే టికెట్ ధరలను సైతం పెంచుకోవడానికి వెసులుబాటు కల్పించింది. సింగిల్ స్క్రీన్స్‌లో జీఎస్టీతో కలిసి అప్పర్ క్లాస్ రూ.110, లోయర్ క్లాస్ రూ.60, మల్టీప్లెక్స్ థియేటర్స్‌లో రూ.135 వరకూ పెంచుకునేందుకు అవకాశం ఇచ్చింది.

# 5M వ్యూస్ ని సొంతం చేసుకున్న 'వెట్టయన్' ప్రివ్యూ




కోలీవుడ్ సూపర్‌స్టార్ రజనీకాంత్ తన తదుపరి చిత్రాన్ని జై భీమ్ ఫేమ్ TJ జ్ఞానవేల్ దర్శకత్వంలో చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ చిత్రానికి మూవీ మేకర్స్ 'వేట్టయాన్' అనే టైటిల్ ని ఖరారు చేసారు.ఈ యాక్షన్ డ్రామాలో లెజెండరీ నటుడు పోలీసు పాత్రలో నటిస్తున్నాడు. ఈ చిత్రం ఇప్పటికే భారీ బజ్‌ని సృష్టించింది. ఇటీవలే మూవీ మేకర్స్ ఈ సినిమా ప్రివ్యూ వీడియోని విడుదల చేసారు. తాజాగా ఇప్పుడు ఈ వీడియో యూట్యూబ్ లో 5 మిలియన్ వ్యూస్ ని సొంతం చేసుకున్నట్లు సమాచారం.ఈ విషయాన్ని తెలియజేసేందుకు చిత్ర బృందం సోషల్ మీడియాలో సరికొత్త వీడియోని విడుదల చేసింది. సాంకేతిక సిబ్బందిలో సినిమాటోగ్రాఫర్ SR కతిర్ I.S.C మరియు ఎడిటర్ ఫిలోమిన్ రాజ్ ఉన్నారు. ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. అమితాబ్ బచ్చన్, రానా దగ్గుబాటి, ఫహద్ ఫాసిల్, మంజు వారియర్, దుషార విజయన్, రితికా సింగ్, జిఎం సుందర్, రోహిణి, రావు రమేష్ ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు.లైకా ప్రొడక్షన్స్‌కు చెందిన సుభాస్కరన్ ఈ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ ఈ సినిమాని సంగీతం సమకూరుస్తున్నారు. ఈ చిత్రం అక్టోబర్ 10, 2024న థియేటర్లలోకి రానుంది. సూపర్ కాప్ థ్రిల్లర్ తెలుగు, తమిళం, కన్నడ మరియు హిందీ భాషలలో విడుదల కానుంది.

# కాజల్ తో రొమాన్స్ అంటే భయపడి పారిపోయిన స్టార్ హీరో..?



కాజల్ అగర్వాల్ తో రొమాన్స్ అంటే ఎవరైనా సరే ఎగిరి గంతేస్తారు. ఎందుకంటే ఆమె అందం అలాంటిది. అయితే అలాంటి ఈ ముద్దుగుమ్మతో రొమాన్స్ అంటే ఓ హీరో భయపడి పారిపోయారట.మరి ఇంతకీ ఆ హీరో ఎవరు..ఎందుకు భయపడాల్సి వచ్చింది అనేది ఇప్పుడు చూద్దాం.కాజల్ తో రొమాన్స్ అంటే భయపడి పోయింది ఎవరో కాదు స్టార్ హీరో చిరంజీవి.. కాజల్ చిరంజీవి కాంబినేషన్లో ఖైదీ నెంబర్ 150 సినిమా వచ్చిన సంగతి మనకు తెలిసిందే.ఇక ఆచార్య మూవీ కూడా షూట్ చేసినప్పటికీ కాజల్ కి సంబంధించిన సీన్స్ తీసేసారు.. అయితే మొదట ఖైదీ నెంబర్ 150 సినిమాలో కాజల్ ని హీరోయిన్గా తీసుకుందామని వివి వినాయక్ చెప్పగా చిరంజీవి మాత్రం కాస్త వెనకడుగు వేసారట. అనుష్కని తీసుకుంటే బాగుంటుంది కదా అని చెప్పారట. కానీ వివి వినాయక్ మాత్రం కాజల్ ని దృష్టిలో పెట్టుకొని ఈ కథ రాసుకున్నారట.చిరంజీవికి మాత్రం ఎక్కడో కాస్త తేడాగా కొడుతుందట.ఎందుకంటే చిరంజీవి కొడుకు రామ్ చరణ్ కాజల్ తో గోవిందుడు అందరివాడేలే, మగధీర,నాయక్ వంటి సినిమాల్లో చేశారు. అయితే వారిద్దరి మధ్య రొమాన్స్ చాలా బాగుంది. వారిద్దరి జోడి చూడచక్కగా ఉంది. కానీ చరణ్తో చేసిన అమ్మాయి మళ్ళీ నా పక్కన అంటే ఆడియన్స్ ఎలా స్వీకరిస్తారో. అసలు మా ఇద్దరికీ సెట్ అవుతుందా లేదా.. పవన్ కళ్యాణ్, బన్నీ తో కూడా కాజల్ చేసింది. అలాంటిది నాతో కాజల్ ఎందుకు నా ఏజ్ కి తగ్గట్టు ఎవరైనా సీనియర్ హీరోయిన్ అయితే బాగుంటుంది అని డైరెక్టర్ కి చిరంజీవి చెప్పారట.కానీ డైరెక్టర్ మాత్రం కాజల్ ని ఫిక్స్ చేశారట.కానీ చిరంజీవికి మాత్రం కాస్త భయం కొడుతుందట. ఇక చిరంజీవి కాజల్ కి సంబంధించిన ఒక పోస్టర్ రిలీజ్ అయ్యాక ఇది చూసిన సురేఖ ఇదేంటి ఆ హీరోయిన్ తో చరణ్ ఎప్పుడు చేశాడు అంటూ షాక్ అయిందట.కానీ పూర్తిగా చూసి హెూ మీరేనా అని చిరంజీవితో చెప్పిందట. అలా వీరిద్దరి మధ్య ఏజ్ గ్యాప్ కొంచెం కూడా కనిపించకపోవడంతో పాస్ అయిపోయాం. సినిమా హిట్ అని చిరంజీవి ఆరోజే అనుకున్నారట. ఇక ఈ విషయాన్ని చిరంజీవి ఓ ఇంటర్వ్యూలో చెప్పారు.

# చంచల్‌గూడ జైలుకు కొరియోగ్రాఫర్ జానీ



అత్యాచార ఆరోపణలు ఎదుర్కొంటున్న టాలీవుడ్ కొరియోగ్రాఫర్ షేక్‌జానీ బాషకు ఉప్పరపల్లి కోర్టు శుక్రవారం 14 రోజుల రిమాండ్ విధించింది. తన వద్ద అసిస్టెంట్‌గా పనిచేస్తున్న యువతి(21)పై అత్యాచారం చేశాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నార్సింగి పోలీసులు షేక్ జానీ బాషాపై పోక్సో, అత్యాచారం కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. కేసు నమోదైనప్పటి నుంచి జానీ బాషా పరారీలో ఉన్నాడు. అక్కడి కోర్టులో ప్రవేశపెట్టి ట్రాన్సిట్ వారెంట్‌పై శుక్రవారం తెల్లవారుజామున హైదరాబాద్‌కు తీసుకుని వచ్చారు. ఇక్కడికి తీసుకుని వచ్చిన తర్వాత ఎస్‌ఓటి పోలీసులు జానీ బాషను రహస్య ప్రాంతంలో విచారించారు. తర్వాత గోల్కొండలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి, ఉప్పర్ పల్లి కోర్టులో హాజరుపర్చారు. కోర్టు జానీ బాషాకు 14రోజుల రిమాండ్ విధించడంతో పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు.

# ఈ మాటలు స్వయంగా చెప్పాలనుకున్నా.. అచ్చ తెలుగులో మాట్లాడి ఆకట్టుకున్న జాన్వీ కపూర్..

తెలుగు అభిమానులకు బాలీవుడ్ స్టార్ నటి జాన్వీ కపూర్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఓ ప్రత్యేక వీడియోను ఇన్‌స్టా వేదికగా షేర్ చేశారు.ప్రస్తుతం జాన్వీ.. ఎన్టీఆర్ 'దేవర' చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఆ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్ అనూహ్యంగా రద్దైంది. దీంతో చిత్ర బృందంతోపాటు, అభిమానులు తీవ్ర నిరాశలో ఉన్నారు. ఇక ఈ ఈవెంట్‌లో ప్రేక్షకులు, అభిమానులకు చెప్పాలనుకున్న మాటలను జాన్వీ ఈ వీడియో ద్వారా చేరవేశారు. ఇందులో జాన్వీ అచ్చతెలుగులో మాట్లాడటం అందరినీ ఆకట్టుకుంటోంది.'అందరికీ నమస్కారం. నన్ను ఇంతగా ఆదరిస్తూ, నాపై ఇంత ప్రేమను చూపిస్తున్నందుకు తెలుగు ఆడియన్స్‌కు ధన్యవాదాలు. నన్ను జానూ పాప అని పిలుస్తున్న ఎన్టీఆర్ అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు. నన్ను మీరు సొంత మనిషిలా భావించడం చాలా సంతోషాన్నిస్తోంది. మా అమ్మ మీకు ఎంత ముఖ్యమో నాకు తెలుసు. మా అమ్మకు కూడా మీరందరూ అంతే ముఖ్యం. అలాగే నాకు కూడా. నన్ను ఇంతలా సపోర్ట్ చేస్తున్న మీరందరూ గర్వపడేలా ప్రతిరోజూ కష్టపడతాను. దేవర నా మొదటి అడుగు. శివ సర్, ఎన్టీఆర్ సర్ నన్ను ఈ సినిమాకు ఎంపిక చేయడం నా అదృష్టంగా భావిస్తున్నాను. మా ప్రయత్నం మీ అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను. ఈ ప్రయత్నంలో నాకు ప్రతి అడుగులోనూ సపోర్ట్‌గా నిలిచినందుకు దేవర టీమ్ ప్రతి ఒక్కరికీ పేరుపేరునా నా ధన్యవాదాలు' అని తెలిపారు.ఈ మాటలు తాను స్వయంగా చెప్పాలనుకున్నట్లు జాన్వీ తెలిపారు. అయితే, ఈ సారి అలా కుదరలేదన్నారు. త్వరలోనే అందరినీ కలుస్తానన్నారు. ప్రస్తుతానికి ఇది తన తరఫు నుంచి అభిమానులకు చిన్న మెసేజ్ అంటూ వీడియోకు క్యాప్షన్ ఇచ్చారు. ప్రస్తుతం ఈ వీడియో వైరల్‌గా మారింది. వీడియోలో జాన్వీ లంగా ఓణీ కట్టుకుని అచ్చ తెలుగులో మాట్లాడుతూ ఆకట్టుకున్నారు.జూనియర్ ఎన్టీఆర్, కొరటాల శివ కాంబోలో వస్తున్న మూవీ దేవర. రెండు భాగాలుగా ఈ మూవీ తెరకెక్కనున్నది. తొలిపార్ట్ ఈ నెల 27న విడుదల కానున్నది. ఈ క్రమంలో మూవీ మేకర్స్ ఆదివారం హైదరాబాద్ హైఐసీసీలో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే, ప్రి రిలీజ్ ఈవెంట్‌కు జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పరిమితికి మంచి అభిమానులు రావడంతో తోపులాట చోటు చేసుకున్నది. ఈవెంట్ కోసం ఏర్పాటు చేసిన వేదిక ఏమాత్రం సరిపోలేదు. ఒక్కసారిగా అభిమానులంతా లోపలికి వెళ్లేందుకు ఎగబడ్డారు.ఆరుబయటే వేలాది మంది అభిమానులు ఉండిపోయారు. మరో వైపు లోపల కార్యక్రమానికి వచ్చిన అతిథులు సైతం కూర్చునేందుకు వీలు లేకుండాపోయింది. పలువురు అభిమానులు ఏర్పాట్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఫర్నీచర్, ఇతర సామగ్రిని ధ్వంసం చేశారు. పోలీసులు వెంటనే స్పందించి.. అభిమానులను బయటకు పంపించి వేశారు. అభిమానులను అదుపు చేయడం అసాధ్యమని భావించడంతో పోలీసులు హెూటల్ నిర్వాహకులు, పోలీసులు ఈవెంట్‌ని క్యాన్సిల్ చేయాలని నిర్ణయించారు. తమ అభిమాన నటీనటులను చూసేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులు నిరాశతో వెనుదిరిగారు.



# రెండో టెస్టులో రాక్షసుడ్ని దింపుతున్న రోహిత్! బంగ్లాతో నాగినీ డ్యాన్స్ ఖాయం!



చెన్నై టెస్ట్‌లో బంగ్లాదేశ్‌ను చిత్తు చిత్తుగా ఓడించిన భారత్ ఫుల్ జోష్‌లో ఉంది. తమను ఓడిస్తామంటూ సిరీస్‌కు ముందు ఓవరాక్షన్ చేసిన షంటో సేనను మూడు చెరువుల నీళ్లు తాగించడంతో హ్యాపీగా ఉంది టీమిండియా.తొలి టెస్ట్‌లో 280 పరుగుల తేడాతో బంగ్లాను ఓడించి ఆధిక్యంలోకి దూసుకెళ్లిన మెన్ ఇన్ బ్లూ.. కాన్పూర్‌లో వాళ్ల కథ ముగించాలని చూస్తోంది. రెండో టెస్ట్‌లోనూ నెగ్గి బంగ్లాను వైట్ వాష్ చేయాలని డిసైడ్ అయింది. అందుకోసం కెప్టెన్ రోహిత్ శర్మ, కోచ్ గౌతం గంభీర్ కలసి అప్పుడే ప్లానింగ్ మొదలుపెట్టేశారు. చెన్నై టెస్ట్‌లో బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్.. ఇలా అన్ని విభాగాల్లో సూపర్ సక్సెస్ అవడంతో అదే జోరును కాన్పూర్ లోనూ కంటిన్యూ చేయాలని అనుకుంటోంది. ఇప్పటికే బంగ్లాను దారుణంగా ఏడిపించిన రోహిత్.. రెండో టెస్ట్‌లో ఆ టీమ్ కష్టాలు మరింత పెంచేందుకు ఓ రాక్షసుడ్ని దింపుతున్నాడని తెలుస్తోంది.బంగ్లాదేశ్‌కు చుక్కలు చూపించేందుకు ఓ రాక్షసుడ్ని బరిలోకి దింపనున్నాడట రోహిత్. అతడు వస్తే అపోజిషన్ టీమ్ పిచ్‌పై నాగినీ డ్యాన్స్ చేయాల్సిందేనని వినిపిస్తోంది. ఇంతకీ ఆ భీకర ప్లేయర్ ఎవరనే కదా మీ ప్రశ్న. అతడే చైనామన్ బౌలర్ కుల్దీప్ యాదవ్ అని తెలుస్తోంది. మొదటి టెస్ట్‌లో పక్కనబెట్టిన ఈ తోపు స్పిన్నర్‌ను సెకండ్ టెస్ట్ కోసం రోహిత్-గంభీర్ రెడీ చేస్తున్నారని సమాచారం. చెన్నై పిచ్‌ను పూర్తిగా పేస్‌కు అనుకూలంగా తయారు చేయించిన టీమిండియా మేనేజ్‌మెంట్.. సెకండ్ టెస్ట్ కోసం కూడా అదే తరహాలో వెళ్లాలని భావిస్తోందట. అయితే సుడులు తిరిగే బంతులతో ప్రత్యర్థులను ఊపిరి ఆడకుండా చేసే స్పిన్ రాక్షసుడు కుల్దీప్‌ను ప్లేయింగ్ ఎలెవన్‌లోకి తీసుకోవాలని ఫిక్స్ అయిందట. దీనికి కొన్ని బలమైన కారణాలు వినిపిస్తున్నాయి.బంగ్లాదేశ్‌కు షాక్ ఇవ్వాలనే ఉద్దేశంతో స్వతహాగా స్పిన్ వికెట్ అయిన చెపాక్‌ను పేస్ పిచ్‌గా మార్చారు. అది సక్సెస్ అయింది. దీంతో ఇదే ప్లాన్‌ను కాన్పూర్‌లోనూ కొనసాగించాలని అనుకుంటున్నారట. అయితే పేస్ బాధ్యతల్ని జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్ ఇద్దరే పంచుకోనున్నారట. తొలి టెస్ట్‌లో ఆకాశ్‌దీప్ బాగానే రాణించినా.. ముగ్గురు సీమర్లు వద్దని టీమిండియా మేనేజ్‌మెంట్ భావిస్తోందట. ఇండియన్ కండీషన్స్‌లో ఎంత పేస్ వికెట్ అయినా ఒకటి, ఒకటిన్నర రోజు మాత్రమే పేస్‌కు అనుకూలిస్తుంది. ఆ తర్వాత రెండున్నర నుంచి మూడ్రోజులు మొత్తం స్పిన్‌దే హవా. చెన్నై టెస్ట్ సెకండ్ ఇన్నింగ్స్ లో అశ్విన్ చెలరేగడమే దీనికి ఎగ్జాంపుల్. అందుకే ముగ్గురు పేసర్లకు బదులు ముగ్గురు స్పిన్నర్లతో వెళ్లాలని రోహిత్ భావిస్తున్నాడట.ఆకాశ్‌దీప్ ప్లేస్‌లో కుల్దీప్ యాదవ్‌ను ప్లేయింగ్ ఎలెవన్‌లోకి తీసుకోవాలని అనుకుంటున్నారట. అతడు టీమ్ లోకి వస్తే బౌలింగ్ ఎటాక్ మరింత బలంగా మారుతుందని, బంగ్లాను ఇంకా ఈజీగా కుప్పకూల్చొచ్చని ప్లాన్ చేస్తున్నారట. కుల్దీప్ టీమ్‌లోకి వస్తాడనేది వార్తలపై సోషల్ మీడియాలో నెటిజన్స్ రియాక్ట్ అవుతున్నారు. గింగిరాలు తిరిగే బంతులతో బంగ్లా బ్యాటర్లకు అతడు పోయించడం ఖాయమని చెబుతున్నారు. ఇంక ఆ టీమ్‌కు దబిడిదిబిడేనని అంటున్నారు. ఒకవైపు బుమ్రా, సిరాజ్.. మరోవైపు అశ్విన్, జడేజా, కుల్దీప్ కలిస్తే ఇంక ఆపడం ఎవరి తరం కాదని చెబుతున్నారు. మరి.. కుల్దీప్ ప్లేయింగ్ ఎలెవన్‌లోకి వస్తే ఎలా ఉంటుందని మీరు భావిస్తున్నారో కామెంట్ చేయండి.

# దులీప్ ట్రోఫీ విజేత ఇండియా-ఎ




ప్రతిష్ఠాత్మక దులీప్ ట్రోఫీలో 'ఇండియా ఎ' ఛాంపియన్‌గా నిలిచింది. ఫైనల్లో ఇండియా సిపై ఘన విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. ఇండియా ఎ జట్టు నాలుగో రోజు 'ఇండియా సి'ని 132 పరుగుల తేడాతో ఓడించి అగ్రస్థానంలో నిలిచింది. సాయి సుదర్శన్(111), రుతురాజ్ గైక్వాడ్(44)లు పోరాడినా ఇండియా సిని గెలుపుటంచులకు చేర్చలేక పోయారు. బ్యాటింగ్, బౌలింగ్‌లో ప్రత్యర్థిని హడలెత్తించంతో పాటు ఫీల్డింగ్‌లోనూ అదరగొట్టింది మయాంక్ సేన.

# టీమిండియాకు భారీ విజయం




చెన్నై : స్వదేశంలో బంగ్లాదేశ్‌తో రెండు టెస్ట్‌ల సిరీస్‌లో టీమిండియా బోణీ కొట్టింది. ఆదివారం ముగిసిన తొలి టెస్ట్‌లో భారత్ 280 పరుగుల భారీ విజయాన్ని నమోదు చేసింది. 515 పరుగుల భారీ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన బంగ్లాదేశ్ రవిచంద్రన్ అశ్విన్(6/88) ధాటికి 234 పరుగులకే కుప్పకూలింది. బంగ్లా బ్యాటర్లలో కెప్టెన్ నజ్ముల్ హుస్సేన్ షాంటో(82) ఒక్కడే ఒంటరి పోరాటం చేశాడు.టీమిండియా బౌలర్లలో అశ్విన్, జడేజా మూడేసి వికెట్లు పడగొట్టగా బుమ్రాకు ఓ వికెట్ దక్కించుకున్నాడు. అంతకుముందు 158/4 ఓవర్‌నైట్ స్కోర్‌తో నాలుగో రోజు ఆటను ప్రారంభించిన బంగ్లాదేశ్ 62.1 ఓవర్లలోనే కుప్పకూలింది. ఓవైపు అశ్విన్.. మరోవైపు జడేజా స్పిన్‌తో బంగ్లా బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టారు. స్పిన్ ద్వయం ధాటికి 24 ఓవర్లలోనే బంగ్లాదేశ్ 6 వికెట్లు కోల్పోయింది. పేసర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్న బంగ్లాదేశ్ ఓవర్‌నైట్ బ్యాటర్లు షకీబ్ అల్ హసన్, నజ్ముల్ షాంటోలు క్రీజులో పాతుకుపోయే ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు.అశ్విన్ వేసిన తన తొలి ఓవర్‌లోనే షకీబ్ అల్ హసన్ క్రీజు వదిలాడు. అనంతరం లిట్టన్ దాస్‌ను జడేజా ఔట్ చేయగా.. మెహ్‌దీ హసన్ మీరాజ్‌ను అశ్విన్ పెవిలియన్ చేర్చాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా.. మరోవైపు నిలకడగా ఆడుతూ సెంచరీ దిశగా సాగుతున్న బంగ్లా కెప్టెన్ షాంటోకు రోహిత్ తన మార్క్ కెప్టెన్సీతో చెక్ పెట్టాడు. జడేజా సాయంతో ఊరించే బంతి వేయించి వికెట్ల ముందు దొరకబట్టాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన టస్కిన్‌ను అశ్విన్ ఔట్ చేయగా.. హసన్ మహముద్‌ను క్లీన్ బౌల్ చేసి భారత విజయాన్ని జడేజా లాంఛనం చేశాడు.భారీ టార్గెట్..భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 376 పరుగులు చేయగా.. బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 149 పరుగులకే చాప చుట్టేసింది. దీంతో టీమిండియాకు 227 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. బ్యాటింగ్‌లో అశ్విన్(113), రవీంద్ర జడేజా(86) సత్తా చాటితే.. బౌలింగ్‌లో జస్‌ప్రీత్ బుమ్రా(4/50) నిప్పులు చెరిగాడు. రెండో ఇన్నింగ్స్‌ను టీమిండియా 287/4 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. శుభ్‌మన్ గిల్ (119 నాటౌట్), రిషభ్ పంత్ (109) శతకాలతో చెలరేగాడు.